సాక్షి
కుమురం భీం

గురువారం । 11 । జనవరి । 2024

7



చైనా మాంజాపై నిఘా
8లో▸

చైనా మాంజా వినియోగంపై పోలీసులు నిఘా పెంచారు. గాలిపటాలు విక్రయించే దుకాణాల్లో తనిఖీలు చేపట్టనున్నారు.

సొంతగూటికి 'కోట్నాక'

ఆసిఫాబాద్: బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్ తిరిగి సొంత గూటికి చేరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ ఆశించి చివరి క్షణంలో ఆయన పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. స్వతంత్ర అభ్యర్థిగా 16వేల పై చిలుకు ఓట్లు సాధించారు. హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.1/19.6

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు

దహెగాం(సిర్పూర్): విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని 15 కేజీబీవీల్లో 3,874 మంది విద్యార్థినులు ఉన్నారని తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణిస్తారన్నారు. లెప్రసీ, ఫైలేరియా కేసులను 2035 నాటికి పూర్తిగా నివారించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అలాగే కేజీబీవీలో ప్రహరీ, వాష్‌రూం, ఇంకుడు గుంత నిర్మాణానికి చర్యలు తీసకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, వైద్యాధికారి స్పందన, ఆర్‌బీఎస్‌కే వైద్యులు సురేందర్, శివరంజిని, జ్యోతి, ఎంఈవో భిక్షపతి, ఎస్‌వో రిజ్వాన పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న రమేశ్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగంతోపాటు కుటుంబానికి సమయం కేటాయించాలన్నారు. ఏ ప్రాంతంలో పని చేసినా అంకితభావం, క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా ఉండటం ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీవో ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీఐలు రాజు, ముత్యం రాజు, ఆర్‌ఐలు అంజన్న, కిరణ్, ఆర్‌ఎస్సైలు ఓదెలు, రాజేశ్, లవన్ పాల్గొన్నారు.


నేడు డార్ఫ్ దంపతుల వర్ధంతి



మార్లవాయిలో పూలమొక్కల మధ్య హైమన్‌డార్ఫ్ నమూనా గృహం

జైనూర్(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో గురువారం ఆదివాసీల ఆత్మబంధువు ప్రొ.హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల వర్ధంతి నిర్వహించనున్నారు. మార్లవాయిలోని డార్ఫ్ దంపతుల విగ్రహాలకు సంప్రదాయం ప్రకారం పూలమాలు వేసి నివాళులర్పించనున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కాగా.. మార్లవాయిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు స్థానికంగా హైమన్ డార్ఫ్ నమూనా గృహం, అతిథిగృహం, గుస్సాడీ శిక్షణ కేంద్రాన్ని నిర్మించారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని డీఈవో అశోక్ అన్నారు. మండలంలోని గుండి ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. డీఈవో మాట్లాడుతూ బ్రేక్ ఫాస్ట్ పథకం అమలువుతున్న పాఠశాలల్లో రోజువారీగా అల్పాహారం వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. వివరాలు నమోదు చేయకుంటే బిల్లులు విడుదల కావని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు వర్క్ బుక్, పాఠ్యపుస్తకాలకు మధ్య సమన్వయం ఉండేవిధంగా బోధించాలన్నారు. సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ మధుకర్ తదితరులు ఉన్నారు.

కుట్ర బయటపడింది!

- అటవీశాఖ అదుపులో పశువుల కాపరులు
- నిందితుల్లో రింగ్‌రీట్ గ్రామవాసులు!
- పశువులను చంపుతున్న పులులను హతమార్చాలనే ఘాతుకం
- ప్రతీకార చర్యలో భాగంగానే విషప్రయోగం
- కొనసాగుతున్న విచారణ



దరిగాం అటవీప్రాంతంలో గాలిస్తున్న సిబ్బంది



అటవీప్రాంతంలో పశువుల కాపరిని విచారిస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి: కాగజ్‌నగర్ డివిజన్‌లో సంచలనం రేపిన కే15, ఎస్9 పులుల మృతి మిస్టరీ వీడుతోంది. పులులు వరుస మృతిని ఎన్‌టీసీఏ తీవ్రంగా పరిగణించింది. జాతీయ స్థాయిలో ఈ ఘటనపై దృష్టి సారించడంతో రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారి రాకేశ్ డోబ్రియాల్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పకడ్బందీగా విచారణ నిర్వహించాలని ఆదేశించారు. సీసీఎఫ్ శాంతారాం ఆధ్వర్యంలో పులుల హత్య కోణంలో కొన్ని బృందాలు దరిగాం, షెర్కపల్లి, రింగ్‌రేట్, చోపన్‌గూడ, లైనుగూడ తదితర గ్రామాల్లో విచారణ చేపట్టాయి. మరోవైపు అటవీప్రాంతంలో మిగతా పులుల ఆచూకీ, వాటి పరిస్థితి తెలుసుకునేందుకు బుధవారం అటవీశాఖ సిబ్బంది బృందాలుగా గాలింపు నిర్వహించారు.

పశువులను కాపాడుకునేందుకే..

దరిగాం, షెర్కపల్లి అటవీ ప్రాంతాల సమీపంలో ఉన్న గ్రామస్తులు అడవుల్లో పశువులను మేపుతుంటారు. ఈ క్రమంలో పులుల సంతతి పెరిగిన తర్వాత పశువుల దాడులు తీవ్రమయ్యాయి. దరిగాం, షెర్కపల్లి ప్రాంతం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అటవీ డివిజన్‌లకు సరిహద్దుగా ఉంది. చుట్టుపక్కల పశువుల కాపరులు ఈ సరిహద్దులను దాటి పశువులను మేపుతుండటం సర్వసాధారణం. ఎక్కువగా గిరిజన గ్రామాలు ఉండే ఈ ప్రాంతంలో రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థలు దారుణంగా ఉన్నాయి. గత డిసెంబర్ 27న పశువులను రింగ్‌రీట్ గ్రామానికి చెందిన ఓ పశువుల కాపరి షెర్కపల్లి అటవీప్రాంతానికి తోలుకెళ్లాడు. పశువుపై పెద్దపులి దాడిచేసింది. తన కళ్లముందే పశువుపై దాడిచేయడాన్ని గమనించిన పశువుల కాపరి మృతిచెందిన పశువు(కోడె ఎద్దు) ఫొటోలను సైతం తన ఫోన్‌లో బంధించారు. గతంలో ఇదే కాపరి కా స్తున్న పశువులను పులులు పలుమార్లు దాడి చేసి హతమార్చాయి. మరికొద్ది రోజుల్లో పంటలు ముగిసిన అనంతరం పశువుల కాపలా తొలగించనున్నారు. ఈ నేపథ్యంలో పులుల నుంచి పశువులకు రక్షణ ఉండదని భావించిన పశువుల కాపరి తోటి కాపరులతో కలిసి పులి హతమార్చాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే దాడిచేసి హతమార్చిన పశువును తినడానికి మళ్లీ పులి వస్తుందని తెలిసి ఆ పశువు కళేబరంపై కాపరులు పురుగుల మందు చల్లారు. ఈ మాంసం తినడంతోనే పులులు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది.

కొనసాగుతున్న విచారణ

పశువుల కాపరుల విచారణలో పశు యాజమాని సహా పులి హత్యకు కారకులుగా భావిస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దరిగాం, షెర్కపల్లి సమీప గ్రామాల పశువుల కాపరులు ఇంకా అటవీశాఖ అధికారుల అదుపులో ఉన్నారు. ఈ పులుల హత్యలో మరెవరైనా ఉన్నారనే కోణంలో విచారణ కొనసాగుతోంది. పూర్తి వివరాలను అటవీశాఖ ఇప్పటివరకు వెల్లడించకపోగా, విచారణ ముగిసిన అనంతరమే వెల్లడించే అవకాశముంది.

డీఎఫ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన

విషప్రయోగం నిందితులను గుర్తించేందుకు షెర్కపల్లి అటవీప్రాంతం సమీపంలో గ్రామాలకు వెళ్లిన అధికారులు విచారణలో మొదట ఇద్దరు అనుమానితులను గుర్తించారు. ఆ సమయంలో వారు ఆసిఫాబాద్ డివిజన్‌లోని ఓ మండలంలో ఉన్నట్లుగా తెలిసింది. అక్కడి అధికారుల ద్వారా వారిని ఆసిఫాబాద్ డీఎఫ్‌వో కార్యాలయం వద్దకు రప్పించారు. వారిని కాగజ్‌నగర్ తీసుకవచ్చేందుకు సిబ్బంది వెళ్లగా, అనుమానితుల సంబంధీకులు ఆసిఫాబాద్ డీఎఫ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కేవలం విచారణలో భాగంగా తీసుకెళ్తున్నామని అధికారులు చెప్పగా, తమందరిని కూడా తీసుకెళ్లాలని భీష్మించుకు కూర్చున్నారు. చివరికి ఆ ఇద్దరిని అధికారులు కాగజ్‌నగర్ ఫారెస్టు కార్యాలయానికి తీసుకువచ్చినట్లు తెలిసింది.

కీలక అధికారిపై తీవ్ర ఆరోపణలు

పులులు మృతిచెందిన ఘటనలో కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో పులుల సంరక్షణలో కీలక అధికారిపై తీవ్ర స్థాయి ఆరోపణలు వస్తున్నాయి. మొదట మృతిచెందిన కే15 పులి ఘటనలో ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడంతో ఉన్నతాధికారులు కూడా సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మొదటి పులి మృతికి ఘర్షణ పడడమే కారణమని ఏకపక్షంగా సమాచారం ఇచ్చేందుకే ఆ అధికారి ప్రయత్నించాడనే ఆరోపణలు ఉన్నాయి. డిప్యూటీ రేంజ్ అధికారి రమాదేవి పులుల కదలికలను గుర్తించే క్రమంలో దరిగాం ప్రాంతంలో విధుల్లో ఉండగా కే15 పులి కళేబరం బయటపడింది. ఈ ఘటనలో సాక్ష్యాధారాలను మాయం చేసేందుకు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి ప్రయత్నించాడని అటవీశాఖలో చర్చ కొనసాగుతోంది. ఇదే అధికారి పెంచికల్‌పేట్ రేంజ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా, ఫాల్గుణ అనే పులి ఐదేళ్ల క్రితం మృతి చెందింది. ఈ ఘటనలో సైతం సమాచారం బయటకు రానివ్వకుండా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఫాల్గుణ మృతి ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది.

రింగ్‌రీట్ గ్రామానికి చెందిన వారే నిందితులు..?

అటవీశాఖ విచారణలో భాగంగా దరిగాం, షెర్కపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరులను బుధవారం కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయంలో విచారించారు. ఈ విచారణలో భాగంగా అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. గతంలో అటవీపరమైన కేసులు నమోదైన వ్యక్తులనూ ప్రశ్నించారు. పులిదాడిలో చనిపోయిన పశువు యజమాని జంగును సైతం విచారించారు. ఈ క్రమంలో పశువుపై విషప్రయోగం చేసిన వారు ఇద్దరు షెర్కపల్లి అటవీప్రాంతానికి సమీపంలో ఉన్న వెల్గీ గ్రామ పంచాయతీ రింగ్‌రీట్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు.

ఆదివాసీల గుండెల్లో డార్ఫ్ దంపతులు



నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, తదితరులు

- రాష్ట్ర మంత్రి సీతక్క
- మార్లవాయిలో డార్ఫ్ దంపతుల విగ్రహాల వద్ద నివాళులు



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

జైనూర్(ఆసిఫాబాద్): అడవి బిడ్డల జీవన స్థితిగతులు మార్చి, వారి అభివృద్ధికి కృషి చేసిన డార్ఫ్ దంపతులు ఆదివాసీల గుండెల్లో శాశ్వతంగా నిలిచారని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో బుధవారం పర్యటించారు. డార్ఫ్ దంపతుల వర్ధంతి సందర్భంగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూ.18లక్షలతో నిర్మించిన ఎలిజబెత్ మ్యూజియాన్ని కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆదివాసీల ఆత్మబంధువు హైమన్ డార్ఫ్ దంపతులు ఆదివాసీ తెగలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించేందుకు కృషి చేశారన్నారు. డార్ఫ్ చేసిన కృషి ఫలితంగా నేటికీ ఆదివాసీలకు ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో ఆదివాసీల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జోడేఘాట్, మార్లవాయి గ్రామాలకు ప్రత్యేక గుర్తింపు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి పాల్గొన్నారు.

జంగుబాయి క్షేత్రంలో సౌకర్యాలు కల్పిస్తాం

- ఐటీడీఏ డీడీ రమాదేవి



కటోడాలతో మాట్లాడుతున్న డీడీ రమాదేవి

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలంలోని జంగుబాయి అమ్మవారి పుణ్యక్షేత్రంలో వసతులు కల్పిస్తామని గిరిజన సంక్షేమశాఖ డీడీ రమాదేవి అన్నారు. ఈ నెల 14 నుంచి జంగుబాయి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం పుణ్యక్షేత్రాన్ని ఎంపీడీవో మహేందర్‌తో కలిసి సందర్శించారు. నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బోర్లు పని చేయడం లేదని కటోడాలు వారి దృష్టికి తీసుకెళ్లారు. మహరాజ్‌గూడ అడవుల్లో ఏర్పాటు చేసిన బోరు నుంచి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా చేపడతామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. అలాగే 20 సోలార్ లైట్లు ఉన్నాయని, ఇంకా అవసరముంటే తెలియజేయాలని సూచించారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టి, చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 14లోగా అన్ని సౌకర్యాలు కల్పించాలని, నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. అంతకు ముందు పోచమ్మ, రావుడ్ దేవతలకు పూజలు చేశారు. వారి వెంట పీఆర్‌ఏఈ నజీమోద్దిన్, సర్పంచ్ లింబాదాస్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలోని వాంకిడి, ఆసిఫాబాద్, కొండపల్లిలో గల సీసీఐ పత్తి కొనుగోలు కేందరాల్లో నిల్వలు అధికంగా ఉన్న నేపథ్యంలో గురువారం నుంచి పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు సీపీవోలు చక్రవర్తి, పన్నాలాల్, వెంగల్‌రెడ్డి తెలిపారు. పునఃప్రారంభం తేదీని త్వరలో ప్రకటిస్తామని, అప్పటివరకు పత్తిని జిన్నింగ్ మిల్లులకు తీసుకురావొద్దని సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్
- ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల వైద్యాధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఆర్‌వీ కర్ణన్

ఉట్నూర్‌రూరల్: గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల వైద్యాధికారులతో బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు.ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం–జన్మన్) కార్యక్రమంలో భాగంగా ప్రతీ పీవీటీజీ కుటుంబానికి ఆరో గ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను అమలు చేయాలన్నారు. ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చే యాలన్నారు. అంతకు ముందు వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. టి–హబ్ ఏర్పాటు కోసం నిర్మాణమైన భవనాన్ని పరిశీలించారు. ఎన్‌ఆర్‌సీలో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. తక్కువ మంది పిల్లలు ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆదిలాబాద్, కుమురంభీం డీఎంహెచ్‌వోలు రాథోడ్ నరేందర్, తుకారాం భట్ తదితరులు ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



జాతర ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే జాతరకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మండల కేంద్రంలో జాతర ఏర్పాట్లలో భాగంగా జాతీయ రహదారితోపాటు ఆలయానికి వెళ్లే రోడ్లను బుధవారం పరిశీలించారు. మండల నాయకులు, అధికారులతో సౌకర్యాలు, వసతులపై చర్చించారు. ప్రధానంగా జాతర సమయంలో ఏర్పడే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. నంబాల గేట్ నుంచి రైల్వేస్టేషన్ వైపు తాత్కాలిక రోడ్డు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. రెబ్బెన జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు జాతర సందర్భంగా ఏర్పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. రైల్వేగేట్ నుంచి ఆలయం వరకు సింగిల్ రోడ్డు ఉండటంతో స్వామి వారి రథోత్సవం రోజుల్లో లక్షల సంఖ్యలో తరలివచ్చే భక్తులతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. గతేడాది జాతరకు వచ్చిన ఎస్పీతో పాటు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు సుమారు ఐదు గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకున్నట్లు గుర్తు చేశారు. అలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రైల్వేగేట్ పడిన సమయంలో వాహనాలు జాతీయ రహదారి పైకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సమీర్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవాజీ, డీబీఎల్ సంస్థ ప్రతినిధి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆగిన అద్దె బస్సులు

- 'హిట్ అండ్ రన్' కేసులకు వ్యతిరేకంగా సమ్మెబాట
- జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో నిలిచిన హైర్‌బస్సులు
- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు
- డిపోకు రూ.5 లక్షల నష్టం



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిలిచిన అద్దె బస్సులు

ఆసిఫాబాద్: భారత న్యాయ సంహిత చట్టంలో భాగంగా కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ కేసులను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హైర్ బస్సు డ్రైవర్స్ యూనియన్ బుధవారం సమ్మెకు దిగింది. ఈ నెల 2న ట్రక్కు డ్రైవర్లు దేశవ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేసిన విషయం తెలిసిందే. కేంద్ర హోంశాఖ కార్యదర్శి చర్చల అనంతరం వారు ఆందోళన విరమించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని టీఎస్‌ఆర్టీసీ హైర్ బస్సు(అద్దె బస్సు) డ్రైవర్లు సైతం హిట్ అండ్ రన్ కేసులకు వ్యతిరేకంగా ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సమ్మె నోటీసు అందించారు. బుధవారం ఉదయం నుంచి వారు విధులకు హాజరు కాలేదు. జిల్లాలో ఆర్టీసీ సొంత బస్సులు మాత్రమే రాకపోకలు సాగించాయి. బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మంచిర్యాల, ఆదిలాబాద్ రూట్లతో షెడ్యూల్ ప్రకారం బస్సులు నడవకపోవడంతో బస్టాండ్‌లోనే గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ కనిపించింది.

డిపోలో 29 హైర్ బస్సులు

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో 77 బస్సు సర్వీసులు ఉండగా, వీటిలో రెండు రాజధాని, 12 లగ్జరీ సర్వీసులు, రెండు ఎక్స్‌ప్రెస్‌లు, 30 ఆర్డినరీలు ఉండగా, మరో 29 అద్దె పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. ప్రతిరోజూ పది రూట్లతో 32,500 కిలోమీటర్ల మేర బస్సులను నడిపిస్తూ సుమారు 22 వేల ప్రయాణికులను గమ్య స్థానానికి చేరుస్తున్నారు. డిపోకు ప్రతిరోజూ సుమారు రూ.17 లక్షల ఆదాయం సమకూరుతుంది. 29 హైర్ బస్సులకు 58 మంది డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం కేవలం 2 అద్దె బస్సులు మాత్రమే నడవగా, 27 బస్సుల డ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో ప్రైవేటు బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. సమ్మెతో బుధవారం ఆసిఫాబాద్ డిపోకు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆర్టీసీ డిపో అధికారులు తెలిపారు.

నిబంధనలపై ఆందోళన

భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం హిట్ అండ్ రన్, ర్యాష్ డ్రైవింగ్ కేసులు కక్ష పూరిత డ్రైవింగ్ కిందకు వస్తాయి. సెక్షన్ 104లో రెండు నిబంధనలపై డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం భారతీయ శిక్షాస్మృతిలో ఇవి సెక్షన్ 304 కిందకు వస్తాయి. నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఐపీసీలో గరిష్ఠంగా రెండేళ్ల వరకు మాత్రమే జైలు శిక్ష ఉంది. మారిన నిబంధనల ప్రకారం ఏడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదాలకు కారణమైన వాహన డ్రైవర్లు ఘటన గురించి పోలీసులు, మేజిస్ట్రేట్‌కు సమాచారం ఇవ్వాలి. అలా ఇవ్వకుండా అక్కడి నుంచి పారిపోతే గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.7 లక్షల జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొనడంతో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గంటకు పైగా బస్టాండ్‌లోనే..



మహారాష్ట్రలోని రాజూరా నుంచి మంచిర్యాలలో ఓ ఫంక్షన్‌కు వెళ్తున్నా. గంటకు పైగా ఆసిఫాబాద్ బస్టాండ్‌లో మంచిర్యాల బస్సు కోసం నిరీక్షించాల్సి వచ్చింది. హైర్ బస్సు డ్రైవర్ల సమ్మెతో సకాలంలో బస్సులు రావడం లేదంటున్నారు. – సురేశ్, రాజూరా, మహారాష్ట్ర

ప్రమాదంలో డ్రైవర్ల జీవితాలు



హిట్ అండ్ రన్ కేసులతో డ్రైవర్ల జీవితాలు ప్రమాదంలో పడతాయి. భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని ప్రభుత్వం వెంటనే మార్చాలి. కేంద్ర ప్రభుత్వం స్పందించే వరకు సమ్మెను కొనసాగిస్తాం. – మధుసూదన్, ప్రైవేటు హైర్ బస్సుల సంఘం జిల్లా అధ్యక్షుడు

సమ్మెతో ఆర్టీసీకి నష్టం

ప్రైవేటు హైర్ బస్సుల డ్రైవర్ల సమ్మెతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్టీసీకి కూడా నష్టం వాటిల్లుతుంది. డ్రైవర్లు వెంటనే సమ్మె విరమించాలి.
– శ్రీధర్, ఆర్టీసీ డీఎం, ఆసిఫాబాద్

క్లుప్తంగా

ప్రమోషన్ పత్రాలు అందజేత


ప్రమోషన్ పత్రాలు అందిస్తున్న మేనేజర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై బుధవారం 29 మంది ఉద్యోగులకు సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ (ఎస్ఎల్‌పీ) పత్రాలను గని మేనేజర్ అల్లావుద్దీన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, కార్యదర్శి దాగం మల్లేశ్, రక్షణాధికారి సునీల్ కుమార్, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి గౌస్ జీశాన్, ఇంజినీర్ బాబు, అండర్ మేనేజర్ నిఖిల్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ బైండోవర్

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌కు చెందిన రౌడీషీటర్ కొప్పుల శ్రీనివాస్‌ను దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపారు. శ్రీనివాస్ పలు నేరాలకు పాల్పడటంతో మళ్లీ ఎలాంటి వివాదాలకు పాల్పడకుండా ఉండేందుకు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లారీ ఢీకొని మేస్త్రీ మృతి


ఆంజనేయులు(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి పాత బస్టాండ్‌లోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుంచాల ఆంజనేయులు (43) మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రిలోని దీపక్ నగర్‌కు చెందిన ఆంజనేయులు మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బైక్‌పై పనినిమిత్తం యాపల్ వైపు వెళ్తుండగా మంచిర్యాల వైపు నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టి కొంతదూరం వరకు ఈడ్చుకెళ్లింది. శరీరం నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని గుండె కొంతదూరంలో పడి కొంతసేపు కొట్టుకున్న సంఘటన చూపరులను కలచివేసింది. లారీ డ్రైవర్ సమీపంలోని యాపల్ ప్రాంతంలో లారీని నిలిపాడు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ రామావతార్ శర్మపై కేసు నమోదు చేశారు. మృతునికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కడెం: మండలంలోని పెద్దూర్‌తండా, నర్సాపూర్, పాండ్వపూర్, అంబారిపేట్ గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, నిఘా విభాగం అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పది లీటర్ల గుడుంబా, 1500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణ తెలిపారు. ట్రాస్క్‌ఫోర్స్ సీఐ రంగస్వామి, గంగారెడ్డి, ఎక్సైజ్ ఎస్సై జె.రమేశ్ ఉన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారి వద్ద బుధవారం సాయంత్రం బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. బోథ్ మండలం ఇస్కర్‌పల్లి గ్రామానికి చెందిన ఆడెం రవిందర్, కడెం మండలం శంభుగూడ గ్రామానికి చెందిన మెస్రం అనిల్ కుమార్‌లు ద్విచక్ర వాహనంపై ఇచ్చోడ వైపు నుంచి బోథ్‌కు వెళ్తుండగా కుప్టి జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

చైనా మాంజాపై నిఘా


కాసిపేట: కోండపూర్‌యాపలో తనిఖీ చేస్తున్న డీఆర్‌వో ప్రవీణ్ నాయక్

- విక్రయించినా.. వినియోగించినా కఠిన చర్యలు
- ధనార్జనే ధ్యేయంగా వ్యాపారుల తీరు
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న అధికారులు
- గతేడాది చైనా మాంజాకు ఒకరు బలి

మంచిర్యాలక్రైం: సంక్రాంతి సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో గాలిపటాలను ఎగురవేసేందుకు ఉపయోగించే చైనా మాంజా వినియోగంపై రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి నిఘా పెంచారు. ఈ నెల 10 నుంచి పది రోజుల పాటు గాలిపటాలు విక్రయించే దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని గాలిపటాలు విక్రయించే దుకాణాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. చైనామాంజాపై నిషేధం ఉన్నప్పటికీ కొందరు సీజనల్ వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా చైనామాంజా విక్రయిస్తున్నారు. చైనామాంజాతో ఆకాశంలో విహరించే పక్షులకు, మానవులకు సైతం ఉరితాళ్లుగా మారే ప్రమాదం ఉంది.

'మామూలు'గా తీసుకున్న అధికారులు

నిబంధనల ప్రకారం చైనామాంజా విక్రయించే దుకాణాలపై అటవీ శాఖ అధికారులు దాడులు నిర్వహించాల్సి ఉండగా ఏటా సంక్రాంతికి ముందు పోలీసులు మాత్రమే అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నారు. అయినా చైనామాంజా లభించకపోవడం, ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేసు నమోదు కాకపోవడంతో అధికారులు తనిఖీ చేసిన తీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది.

విక్రయిస్తే చర్యలు...



చైనామాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించి సహకరించండి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. 100కు లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు సమాచారం అందించండి.
– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

విక్రయిస్తే ఏడేళ్లు జైలు

2017 జూలై 17న తెలంగాణ ప్రభుత్వం చైనామాంజాను నిషేధించింది. విక్రయించిన వారికి ఏడేళ్ల జైలుశిక్ష, జరిమానా అమలు చేసింది. దీనిని వినియోగించడం వలన పక్షులు, జంతువులు, ద్విచక్ర వాహనదారులకు పతంగులు ఎగురవేసే వారికి సైతం ప్రాణహాని కలిగే అవకాశం ఉంటుందని వన్యప్రాణి ప్రేమికులు, పలు స్వచ్ఛంద సంస్థల అభ్యర్థన మేరకు గాజుపూత పూసిన చైనామాంజ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పర్యావరణ రక్షణ యాక్ట్ 1986, ప్రివెన్షన్ క్రూయేల్టీ టూ ఎనిమాల్స్ యాక్ట్ 1960 అమలులో ఉంది.

- 2022, జనవరి 16న పాత మంచిర్యాలలోని రాళ్లవాగు బ్రిడ్జిపై చైనామాంజాకు తగిలి పస్తం భీమయ్య (40) అనే వలస కూలీ మృతి చెందిన సంఘటన కుటుంబంలో విషాదం నింపింది. ఘటన జరిగిన రోజు పోలీసులు గాలిపటాలు విక్రయించే దుకాణాలపై దాడులు నిర్వహించగా ఎక్కడా చైనామాంజా లభించకపోవడం గమనార్హం.
- గతేడాది హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో బజాజ్ కైట్స్ నిర్వాహకుడు భగవన్‌దాస్ బజాజ్‌కు చెందిన దుకాణంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేయగా రూ.12 లక్షల విలువైన చైనామాంజా స్వాధీనం చేసుకున్న సంఘటన సంచలనం సృష్టించింది.

రక్షణతో పనిచేస్తే ప్రమాదాలకు దూరం


రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

శ్రీరాంపూర్: రక్షణతో పనిచేస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా అన్నారు. బుధవారం ఆర్కే న్యూటెక్ గనిపై రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్షణ పాటిస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణసూత్రాలు పాటించాలన్నారు. సంస్థకు బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో ఉద్యోగుల ప్రాణాల రక్షణ అంతే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ రాముడు, మేనేజర్ స్వామిరాజు, రక్షణాధికారి కొట్టె రమేశ్, సంక్షేమాధికారి పాల్‌సృజన్, ఇంజినీర్ కృష్ణ, వెంటిలేషన్ అధికారి చంద్రమౌళి, సర్వే అధికారి పిచ్చేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'పెన్షన్ పెంపుదల కోసం పోరాడాలి'


మాట్లాడుతున్న రాంచందర్

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ పెంపుదల కోసం పోరాడాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజ్ రాంచందర్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సిద్ధార్థనగర్‌లోని సీనియర్ సిటిజన్ హాల్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపుదల, సీపీఆర్ఎంఎస్ స్కీంలో వైద్యఖర్చుల పెంపుదల, ఇంటిస్థలం, తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న కోల్‌కత్తాలోని కోలిండియా కార్యాలయం, కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాదవ్, నాయకులు బీరయ్య, నర్సింగ్‌రావు, కనుకయ్య, ఉమాకర్, లక్ష్మీనారాయణ, జయంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలకు చేరిన విద్యార్థి మృతదేహం

- ఈ నెల 2న యూఎస్ఏలో గుండెపోటుతో మృతి


భార్గవ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఈ నెల 2న యూఎస్ఏలో గుండెపోటుతో మృతి చెందిన విద్యార్థి మృతదేహం బుధవారం మంచిర్యాలకు చేరుకుంది. పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన నరెడ్ల గిరి–లక్ష్మి దంపతుల కుమారుడు సాయి భార్గవ్ (30) మంచిర్యాలలో ఇంటర్, బీ టెక్ (ఈఈఈ) హైదరాబాద్‌లో పూర్తి చేశాడు అనంతరం ఉన్నత చదువుల నిమిత్తం యూఎస్ఏకు వెళ్లి అక్కడే ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 2న గుండెపోటుకు గురై మృతి చెందడంతో అతని స్నేహితులు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. కొడుక మరణ వార్త విన్న ఆ కుటుంబ సభ్యులు వారం రోజులుగా శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం మృతదేహానికి గోదావరి తీరంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మార్కెట్ యార్డులోనే టోకెన్లు పొందాలి


మాట్లాడుతున్న సీపీవో ఉదయ్‌షా

చెన్నూర్: మార్కెట్ యార్డుకు పత్తి తీసుకువచ్చి రైతులు టోకెన్లు పొందాలని సీసీఐ సీపీవో ఉదయ్‌షా, మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో జిన్నింగ్ మిల్ యాజమానులు, ట్రేడర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నామన్నారు. పత్తిని విక్రయించే రైతులు వాహనాలలో 40 క్వింటాళ్లు మించకుండా తీసుకురావాలన్నారు. 8 నుంచి 12 శాతం తేమ ఉంటే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. మార్కెట్‌యార్డులో తేమ పరిశీలించిన తర్వాత టోకెన్లు పొందాలని సూచించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీజీఎం శ్రీనివాసరావు

జైపూర్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సింగరేణి డీజీఎం(ఐటీ) కార్పొరేట్ ఎం.శ్రీనివాసరావు సూచించారు. జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో బుధవారం జాతీయ సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ కోల్, మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జాతీయ సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిన్న బసివిరెడ్డి, ఏజీఎంలు శ్రీనివాసులు, ప్రసాద్, సుధాకర్, డీజీఎం మధుసూదన్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపేటలో చోరీ

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన దావుద్‌ఖాన్ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బుధవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో దాచి ఉంచిన రెండు తులాల బంగారు, 38 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఎస్సై ప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో వచ్చి పరిశీలించారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎండీని కలిసిన ఓదెలు


పుష్పగుచ్ఛం ఇస్తున్న నల్లాల ఓదెలు

మందమర్రిరూరల్: సింగరేణి నూతన సీఎండీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బలరాంను చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు క్రాంతి ఉన్నారు.

యువ కవికి ఆహ్వానం


ఆత్రం మోతీరాం

వాంకిడి(ఆసిఫాబాద్): ఈ నెల 26 నుంచి 28 వరకు విశాఖపట్టణంలో నిర్వహించనున్న తెలుగు వికీపీడియా 20వ వార్షికోత్సవానికి వాంకిడి మండలం నగరిగుట్ట గ్రామానికి చెందిన ఆదివాసీ యువ కవి, రచయిత ఆత్రం మోతీరాంకు ఆహ్వానం అందింది. తెలుగు వికీపీడియాలో వ్యాసాలు రాయడం, కొలాం సంస్కృతికి సంబంధించి ఫొటోలు పొందుపర్చడం.. తదితర అంశాల్లో కృషికి ఆహ్వానం అందినట్లు మోతీరాం తెలిపారు. బోలి చేతో ఫౌండేషన్ సీఈవో నేతి సాయి కిరణ్, కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆత్రం భీంరావు, వసంత్‌రావు ఆయనను అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట


మంచిర్యాల గోదావరివద్ద బారికేడ్లు

మంచిర్యాలక్రైం: ఇసుక ట్రాక్టర్లు గోదావరినదిలోకి వెళ్లకుండా మైనింగ్ అధికారులు బుధవారం బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇసుక అక్రమ రవాణను నియంత్రించేందుకు కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం మైనింగ్, పోలీస్. రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మైనింగ్ ఏడీ బాలు పోలీసుల సహాయంతో పాత మంచిర్యాల, స్థానిక కాలేజీరోడ్ లోని గోదావరి వద్ద ఇలా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

కార్మెల్ విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: డిసెంబర్ 27 నుంచి 29 వరకు కేరళలో విద్యా అకాడమి ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీ నిర్వహించిన ఇండియన్ స్పేస్ సైన్స్ (ఐఎస్ఎస్) ఒలింపియాడ్ జాతీయ స్థాయి ఫైనల్ పరీక్షలో మంచిర్యాల కార్మెల్ హైస్కూల్ విద్యార్థి హేమంత్‌కుమార్ ప్రతిభ కనబరిచారు. 100 మార్కులకు గానూ 85 మార్కులు సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కూచిపూడి నాట్యంలో విష్ణుప్రియ కళాకార్ బుక్ ఆఫ్‌వరల్డ్ రికార్డులో పేరు నమోదు చేసుకుంది. బుధవారం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిన్సీ, వైస్ ప్రిన్సిపాల్ టీస్సీ, సిస్టర్ లిల్లి విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రిన్సీ

మంత్రాల నెపంతోనే వ్యక్తి హత్య

- కేసు ఛేదించిన తిర్యాణి పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేందర్

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలోని మానిక్యపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజ్‌గూడ శివారులో గత శనివారం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అల్లం నరేందర్ వివరాలు వెల్లడించారు. ఈనెల 5న తిరుపతి తన పంట చేనుకు కాపలాగా వెళ్లగా పథకం ప్రకారం ఐదుగురు వ్యక్తులు కలిసి హత్య చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాజ్‌గూడలో తిరుపతి కొన్నిరోజులుగా సఖ్యంగా ఉండకపోవడం, నిందితుల్లో ఒకరైన నగేష్ తండ్రి మారుతికి కొన్నిరోజులుగా ఆరోగ్యం బాగాలేకపోవడం నగేష్‌లో అనుమానాలు పెంచింది. తన తండ్రికి తిరుపతి మంత్రాలు చేస్తున్నాడని అనుమానించసాగాడు. ఈ తరుణంలోనే నగేష్ బంధువులైన జుగునక హిరామన్, చిక్రం మారుతి, హర్షవర్ధన్, ఆత్రం చిన్ను సాయంతో హత్య చేశారు. హత్యకు ఉపయోగించిన టార్చిలైట్, గొడ్డళ్లు, మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్సై చుంచు రమేశ్, సిబ్బందిని సీఐ అభినందించారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుళ్లు ప్రభాకర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు


ఎంపికైన గురుకుల విద్యార్థులు

జైపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నిర్వహించిన జిల్లాస్థాయి అట్యాపాట్య శిక్షణ శిబిరం నుంచి పి.రామ్, జె.వెంకటేశ్, కె.లక్ష్మీకాంత్, ఎస్.మణీశ్వర్, డి.జశ్వంత్, సీహెచ్.జశ్వంత్, కె.నిరంజన్, బి.సంజయ్, పి.లక్ష్మణ్ ఎంపికయ్యారు. బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ బాలభాస్కర్, జిల్లా కోచ్ రాజలింగు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

'కడెం' మరమ్మతుకు చొరవ చూపండి


మంత్రికి విన్నవిస్తున్న నాయకులు

జన్నారం: రైతులకు వ్యవసాయ సాగుకు జీవనాధారమైన కడెం ప్రాజెక్టు ఆధునీకరణకు చొరవ చూపాలని జన్నారం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు బుధవారం మంత్రి సీతక్కను కలిసి విన్నవించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఖానాపూర్ నియోజక వర్గంలోని కడెం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన మంత్రికి నాయకులు ముజాఫర్ అలీఖాన్, మిక్కిలినేని రాజశేఖర్, గుర్రం మోహన్‌రెడ్డి, ఏనుగు సుభాష్‌రెడ్డి, ఫసీఉల్లా వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టుకు ముప్పు వాటిల్లి జల ప్రళయం జరుగక ముందే స్పందించి, మరమ్మతులు చేయించాలని కోరారు.

బండ తరలిస్తున్న ట్రాక్టర్ల అడ్డగింత


ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

కాసిపేట: రొట్టెపల్లి గ్రామ పంచాయతీ శివారులోని నర్సింగసాగర్ చెరువు సమీపంలో ఉన్న గుట్టలను తవ్వి అక్రమంగా బండరాయిని తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్రమంగా గుట్టలు తవ్వవద్దని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్ అధికారులకు ఫోన్ చేస్తే తమకు సంబంధంలేదని, అటవీ అధికారులకు తెలపాలని సూచించారన్నారు. అధికారుల అండదండలతో ట్రాక్టర్ యాజమానులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్నారు. మరోసారి అటువైపు రామని ఒప్పుకోవడంతో ట్రాక్టర్లను వదిలి పెట్టారు.

'పోలీస్' షార్ట్ ఫిలిం చిత్రీకరణ


బస్టాండ్ వద్ద చిత్రీకరిస్తున్న ఓ సన్నివేశం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బస్టాండ్, ఐబీ, బెల్లంపల్లి చౌరస్తా ప్రాంతంలో ఓ పోలీస్ అధికారి యూనిఫామ్‌లో హడావిడిగా పరుగెత్తుతున్న దృశ్యాలను చూసిన ప్రజలు 30 నిమిషాల పాటు అసలేం జరిగిందని అయోమయంలో పడిపోయారు. కొంత సమయం తర్వాత ఇదంతా ఓ షార్ట్ ఫిలిమ్ చిత్రీకరణ జరుగుతోందని తెలిశాక ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై ఫిలిం డైరెక్టర్ తిరుపతి కే.వర్మను వివరణ కోరగా ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేసే ఓ పోలీస్ అధికారి సాహసాలపై షార్ట్ ఫిలిం తీస్తున్నట్లు తెలిపారు. హీరోగా తోట మహేష్ (సీఐ క్యారెక్టర్) నటించాడని తెలిపారు.

ఎల్ఐసీ ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలి

పాతమంచిర్యాల: జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలని ఎల్ఐసీ సంస్థ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. 17 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల వేతనాల సవరణ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారుల సంఘం నాయకులు మాలతిదేవి, సిరాపాణి, వికాసాధికారుల సంఘం నాయకులు సతీష్‌కుమార్, ప్రవీణ్, ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రమేష్‌బాబు, చరణ్, రాందాసు పాల్గొన్నారు.

సుందరకాండ పారాయణ పోస్టర్ల విడుదల

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఆవోపా ఆధ్వర్యంలో ఈ నెల 18నుంచి 21వరకు జిల్లా కేంద్రంలోని హైలైఫ్‌లో నిర్వహించే అష్టోత్తర శత సుందరకాండ పారాయణ సహిత శ్రీ రుద్రమహాయాగ కార్యక్రమం పోస్టర్లను బుధవారం హైలైఫ్‌లో విడుదల చేశారు. ఆవోపా ప్రధాన కార్యదర్శి సిరిపురం శ్రీనివాస్, సహస్ర అవధాని, పద్మశ్రీ, బ్రహ్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 21వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. గరికపాటి నరసింహారావుతో విశేష ప్రవచనాలుంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

సంక్షిప్త వార్తలు

వంద శాతం అక్షరాస్యత సాధించాలి

భీమిని: కన్నెపల్లి గ్రామాన్ని వంద శాతం అక్షరాస్యతగా తీర్చిదిద్దాలని డీఈఓ యాదయ్య అన్నారు. బుధవారం లయన్స్‌క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కన్నెపల్లి గ్రామాన్ని వంద శాతం అక్షరాస్యత గ్రామంగా తీర్చిదిద్దేందుకు వయోజన విద్యావాలంటరీలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని నిరక్షరాస్యులకు అక్షరాస్యత నేర్పే విధంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, కొటారపు సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనదారులతో సమీక్ష సమావేశం

మందమర్రిరూరల్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ హిట్ అండ్ రన్ చట్టంపై మందమర్రి సీఐ కార్యాలయ ఆవరణలో కేకే–ఓసీ, ఆర్కే ఓసీల్లో బొగ్గు రవాణా చేసే వాహనాల డ్రైవర్లు, ఓనర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మందమర్రి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య హాజరై పలు సూచనలు చేశారు. కాగా, చట్టాన్ని లారీల డ్రైవర్లు, ఓనర్లు నిరసిస్తూ మంగళవారం నుంచి సమ్మెలో పాల్గొనగా బొగ్గు రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఈ సమావేశంలో కేకే–ఓసీ, ఆర్కే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ రమేష్ గోవిందరావు, మందమర్రి ఎస్సై చంద్రకుమార్, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్పులు విడుదల చేయాలి

జన్నారం: అర్హులైన ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్పులు వెంటనే ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల మేనేజ్‌మెంటు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గౌరి సతీశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాల మేనేజ్‌మెంటు అసోసియేషన్ సమావేశంలో జిల్లా కమిటీని నియామకం చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా బీ.సాయిలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా సీహెచ్.వెంకట్‌రెడ్డి, బీ.ప్రభాకర్‌రెడ్డి, భూమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డాక్టర్ అరవింద్ సేవలు ఎనలేనివి

మంచిర్యాలటౌన్: జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన ప్రముఖ ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ అరవింద్ సేవలు ఎనలేనివని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) సూపరింటెండెంట్ డాక్టర్ అరవింద్ వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛందంగా తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయనను కలెక్టరేట్ కార్యాలయంలోని తన కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది డాక్టర్ అరవింద్, డాక్టర్ నూతన్ దంపతులను శాలువా కప్పి సత్కరించారు.